## డెంగీ నియంత్రణకు పటిష్ట చర్యలు : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, నవంబర్ 17: డెంగీ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం అధికారులతో డెంగ్యూ నియంత్రణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో జనవరి, 2023 నుంచి ఇప్పటి వరకు 465 పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. పాజిటివ్ వచ్చిన వారి చుట్టు ప్రక్కల ఇంటింటి సర్వే చేసి శాంపిల్స్ సేకరించి లక్షణాలను గుర్తించేందుకు పరీక్షలు చేయాలని, డెంగ్యూకి గురైన ఇంటితో పాటు చుట్టూ ప్రక్కల ఇళ్లల్లో వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నియంత్రణలో ప్రజలు పాలుపంచుకోవాలని తెలిపారు. నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ఫాగింగ్ చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డా.బి.మాలతి, జడ్పీ సీఈవో అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా విద్యాధిశాఖాకారి సోమశేఖర శర్మ, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి సైదులు పాల్గొన్నారు.

**ఎన్నికల కంట్రోల్ రూం తనిఖీ**

నూతన కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్‌కి వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను పరిశీలించారు. సి విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, పరిష్కార వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్ట్, స్ట్రాంగ్ రూమ్‌లపై నిఘా పెట్టాలన్నారు. సీపీవో ఏ. శ్రీనివాస్, అధికారులు తదితరులు ఉన్నారు.

## బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి
### పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ విష్ణు వారియర్

మామిళ్లగూడెం, నవంబర్ 17: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీస్ సిబ్బందికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ శుక్రవారం కమిషనరేట్ నుంచి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా విజయవంతం చేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది చేయాల్సినవి, చేయకూడని విధుల జాబితాను సిద్ధం చేసి అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పోలింగ్ స్టేషన్ విధుల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు తమ ఓటు వేసిన తర్వాత పోలింగ్ బూత్, పోలింగ్ స్టేషన్ చుట్టూ తిరగకుండా చూసుకోవాలన్నారు. ఓటింగ్ చివరి గంటలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్, ఎస్‌హెచ్‌వో, మొబైల్ పార్టీ ఇన్‌చార్జి, క్యూఆర్‌టీ, ఎస్ఎస్‌టీ మొదలైన ముఖ్యమైన ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేకంగా అభ్యర్థించకపోతే ఏ పోలీసు అధికారి పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించకూడదని ఆదేశించారు.

## ప్రతి ఓటరుకు ఓటు స్లిప్‌లు అందాలి : ఆర్‌వో



ఓటర్ స్లిప్ పంపిణీని పర్యవేక్షిస్తున్న ఖమ్మం ఆర్‌వో ఆదర్శ్ సురభి

ఖమ్మం, నవంబర్ 17: ఖమ్మం నియోజకవర్గంలో ప్రతి ఒక్క ఓటరుకు ఓటరు సమాచార స్లిప్పులు అందేలా కార్యాచరణ అమలు చేయాలని ఖమ్మం రిటర్నింగ్ ఆఫీసర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం ఖమ్మం ఎన్‌టీఆర్ సర్కిల్, బ్యాంక్ కాలనీ, రోటరీ నగర్, పరిసర ప్రాంతాల్లో ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు సమాచార స్లిప్పు గురించి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్పుతో పాటు, ఓటరు గైడ్, సి విజిల్ యాప్‌పై రూపొందిన కరపత్రాన్ని ఇవ్వాలన్నారు. ఎవరి ఓటరు స్లిప్పు వారికే ఇవ్వాలని, రశీదు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ నెల 30న పోలింగ్ తేదీ జరిగే పోలింగ్‌లో ప్రతి ఓటరు ఓటు వేయాలని ఆర్‌వో కోరారు.

# అజయ్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం

**మా ఓటు కారుకే.. మా మద్దతు అజయ్‌కే..**

**ఇంటింటి ప్రచారంలో పువ్వాడకు మద్దతు తెలుపుతున్న డివిజన్ల ప్రజలు**

ఖమ్మం, నవంబర్ 17: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం నగరం 31వ డివిజన్ నందు ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు అజయ్ కుమార్ గెలుపు కోసం హారతులు పట్టి దీవించారు. తమ పూర్తి మద్దతు సీఎం కేసీఆర్, అజయ్‌కే అంటూ ఏకపక్ష నిర్ణయంతో ఉన్నామని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించుకుంటామని సుస్పష్టం చేస్తున్నారు. ఒకప్పుడు మా ఇంటి ముందు కనీసం రోడ్డు లేదు.. కాల్వలు లేవు ఇప్పుడు ఇంటి ముందు సీసీ రోడ్డు, కాల్వలు, విద్యుత్ దీపాలు, ఇన్ ఇంటింటికీ త్రాగునీరు ఉన్నాయి సార్ అంటూ మహిళలు వారి అభిప్రాయాన్ని వ్యక్త పరుస్తున్నారు. టిఫిన్ సెంటర్‌లో అమ్మ.. నేను వేస్తా దోశా.. అంటూ నిర్వాహకురాలితో కలిసి దోశలు వేసి ప్రజలకు అందించారు. బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, కాంగ్రెస్‌కు అవకాశమిస్తే ఆగమైపోతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీకి మరోసారి భారీ మెజార్టీ ఇచ్చి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



దోశ వేసి ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి పువ్వాడ



బీఆర్ఎస్‌లో చేరుతున్న సీపీఎం నాయకులు కోదారి గిరి

### బీఆర్ఎస్ చేరిన సీపీఎం నాయకుడు గిరి

ఖమ్మం, నవంబర్ 17: ఖమ్మం నియోజకవర్గంలో పదేళ్లుగా కొనసాగుతున్న అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, ఖానాపురం హవేలీ సీపీఎం మాజీ కార్యదర్శి కోదాటి గిరితో పాటు ఆయన అనుచరులు శుక్రవారం పువ్వాడ అజయ్ సమక్షంలో బీఆర్‌యస్‌లో చేరారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సీపీఎం పార్టీలో 30 ఏళ్ళుగా వివిధ బాధ్యతల్లో పని చేశానని, ఈ రోజు ఖమ్మం అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామమని అని పేర్కొన్నారు. కమ్యూనిస్టు అభిమానులు ఇంకా అనేక మంది తన విజయాన్ని కాంక్షిస్తూ పరోక్షంగా సహకరిస్తున్నారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, చిరుమామిళ్ళ లక్ష్మి నాగేశ్వరరావు, సరిపుడి రమాదేవి సతీశ్, వల్లభనేని రామారావు ఉన్నారు.

## ‘అజయ్’ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



2వ డివిజన్‌లో ప్రచారంలో పాల్గొన్న విజయ్‌కుమార్

రఘునాథపాలెం, నవంబర్ 17: బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ గెలుపుతోనే ఖమ్మం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ డివిజన్ నాయకులు అన్నారు. పువ్వాడ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలంలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం, ఓటర్ లిస్టు పరిశీలన కార్యక్రమాలు చేపట్టారు. కారు గుర్తుకు ఓటేసి అజయ్‌కుమార్‌కు అత్యధిక మెజార్టీ అందించాలని ప్రజలను కోరారు. రేగులచలక ఎన్నికల ప్రచారంలో సర్పంచ్ కొర్లపాటి రామారావు, ఉప సర్పంచ్ నున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పాండురంగాపురంలో జరిగిన ప్రచారంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు నర్రా యల్లయ్య, బూత్ ఇన్‌చార్జ్ హెచ్ ప్రసాద్, షేక్ మధార్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభావేదిక ఏర్పాట్లు పరిశీలించిన బీఆర్ఎస్ మధిర అభ్యర్థి కమల్‌రాజు



సభా స్థలం ఏర్పాట్లపై సూచనలిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల

మధిర, నవంబర్ 17 : ఈ నెల 21న మధిరలో జరగబోయే సీఎం కేసీఆర్ బహిరంగ సభా ఏర్పాట్లను బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం సభ కోసం వేదిక ఏర్పాటుపై నిర్వాహకులకు పలుసూచనలు, సలహాలు చేశారు. బహిరంగసభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సభా స్థలం పక్కనే హెలీప్యాడ్ ఏర్పాటు ఉంటుందని, అక్కడి నుంచి సభా స్థలం వరకు రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వారితో పాటూ డీసీసీబీ జిల్లా వైస్‌చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, చావా వేణు, మంకెన రమేశ్, అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కఠారి రాఘవరావు, బిక్కి కృష్ణప్రసాద్, కరివేద సుధాకర్, మెండెం వెంకన్న, యన్నంశెట్టి అప్పారావు, సయ్యద్ ఇక్బాల్, ముత్తారపు ప్యారీ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ నిర్వహణలో ఖమ్మం ఏఎంసీ భేష్



వ్యాపారులతో సమావేశమైన గుంటూరు మార్కెట్ చైర్మన్ రాజనారాయణ

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 17: మార్కెట్‌లో అన్ని రకాల క్రయవిక్రయాల్లో అమలు చేస్తున్న ఆన్‌లైన్ విధానం తమను ఎంతో ఆకట్టుకున్నదని ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని గుంటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో అమలవుతున్న ఆన్‌లైన్ విధానంపై అవగాహన చేసుకునేందుకు గుంటూర్ ఏఎంసీ చైర్మన్ జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏడీఏ రాజాబాబు, వ్యాపారులతో కలిసి మార్కెట్‌ను సందర్శించారు. తొలిసారిగా మార్కెట్ సందర్శనకు వచ్చిన చైర్మన్, అక్కడి అధికారులు, వ్యాపారులకు నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ రుద్రాక్ష మల్లేషం, గ్రేడ్–టూ అధికారి బజార్, సహాయ కార్యదర్శి వజీర్ ఘనస్వాగతం పలికారు. అనంతరం అపరాలు, మిర్చి, పత్తియార్డును వారు సందర్శించారు. అనంతరం ఖమ్మం వర్తక సంఘం వ్యాపారులు, అధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణలో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా ఉన్న ఖమ్మం ఏఎంసీలో క్రయవిక్రయాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి తెలుసుకునేందుకు వచ్చామమన్నారు. గుంటూర్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకటరెడ్డి, ఎగుమతిశాఖ అధ్యక్షుడు సాంబశివరావు, దిగుమతిశాఖ అధ్యక్షుడు అప్పిరెడ్డి, నగర మార్కెట్ మిర్చిశాఖ అధ్యక్షుడు యడ్లపల్లి సతీష్, ఎగుమతిదారులు దొంగరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల ఉచ్చులో పడబోము..

**విలేకరుల సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు**



మాట్లాడుతున్న మేయర్ నీరజ, పగడాల తదితరులు

ఖమ్మం, నవంబర్ 17: ఖమ్మంలో రాజకీయాలు చాలా విచిత్రంగా ఉన్నాయని, కాంగ్రెస్ నాయకులు సంతలో పశువుల్లా బీఆర్ఎస్ కార్పొరేటర్లను కొనుగోలు చేస్తూ డీప్ ఫేక్ వాయిస్‌లు సృష్టిస్తూ తిట్టకుండానే తిట్టినట్లు, మాట్లాడని మాటలు మాట్లాడినట్లు సృష్టించడం పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు, నాయకుతో కలిసి ఆమె మాట్లాడారు. కొద్ది మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లినంత మాత్రాన బీఆర్ఎస్ బలం చెక్కు చెదరలేదని, ప్రజలంతా మావైపే ఉన్నారని, ఆయా డివిజన్లలో ప్రజలు స్వచ్ఛందంగా పువ్వాడ అజయ్‌కు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. మంత్రి పువ్వాడ ఏ కార్పొరేటర్‌ను తిట్టిన దాఖలాలు లేవన్నారు. డీప్ ఫేక్‌లు సృష్టించడం మాకు తెలుసు.. కానీ మా సంప్రదాయం అది కాదన్నారు. అజయ్‌కుమార్ ఖమ్మంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్నారు. కాంగ్రెస్ నాయకులు మైండ్‌గేమ్‌లు మానుకోవాలని హితవు పలికారు. నిఖార్సయిన, నిజాయితీ పరులమని మేయర్ అన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ.. తలలు తెగినా మేము పార్టీ మారమని, నిసిగ్గు రాజకీయాలు చూస్తుంటే రోత పుడుతుందన్నారు. తుమ్మలకు కాంగ్రెస్ క్యాడర్‌పై నమ్మకం లేకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్లను సంతలో పశువుల్లా కొంటున్నారని మండిపడ్డారు. సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, పల్లా రోజ్‌లీనా, షేక్ మక్బుల్ మాట్లాడుతూ.. కొద్ది మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లినంత మాత్రాన అజయ్‌కుమార్ గెలుపును ఆపలేరన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు నాగండ్ల కొటి, పసుమర్తి రామ్మోహన్, రాపర్తి శరత్, మడూరి ప్రసాద్ పాల్గొన్నారు.